క్లుప్తంగా...

ఒకటో తేదీ నుంచి మెగా లోక్‌అదాలత్

మేడ్చల్: వచ్చేనెల ఒకటి నుంచి 9వ తేదీ వరకు మెగా లోక్ అదాలత్‌లను నిర్వహిస్తున్నారని మేడ్చల్ ట్రాఫిక్ సీఐ హనుమాన్‌గౌడ్ తెలిపారు. ట్రాఫిక్ విభాగంలో పాత కేసులు, లైసెన్సులు లేని డ్రైవింగ్ కేసులు, డంకన్ డ్రైవ్ కేసులు, ఇతర కేసులున్న వారు లోక్ అదాలత్‌కు హాజరై కేసులను పరిష్కరించుకోవాలని ఆయన కోరారు.

లో ఓల్టేజీతో ఇబ్బందులు పడుతున్నాం



మంత్రి మల్లారెడ్డితో మాట్లాడుతున్న కీసర రైతులు

కీసర: మండల కేంద్రమైన కీసరలోని మక్తా కంచెలో గల వ్యవసాయదారులు మంగళవారం మంత్రి మల్లారెడ్డిని కలిసారు. లోఓల్టేజీ కారణంగా వ్యవసాయానికి ఇబ్బందులు ఏర్పడుతున్నాయని, సమస్యను పరిష్కరించాలని విన్నవించారు. ఈ మేరకు సానుకూలంగా స్పందించిన మంత్రి మల్లారెడ్డి సమస్యను పరిష్కరించేందుకు చర్యలు చేపట్టనున్నట్లు హామీ ఇచ్చారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు జలాల్‌పురం సుధాకర్‌రెడ్డి, కీసరగుట్ట ట్రస్టు బోర్డు సభ్యుడు జంగయ్యయాదవ్, చినింగని బాల్‌రాజ్, కుంటోళ్ల రవి, మల్లేష్ పాల్గొన్నారు.

సింగపూర్ పర్యటనలో ప్రజాప్రతినిధులు



సింగపూర్ యూనివర్సల్ స్టూడియో వద్ద గుండ్లపోచంపల్లి మున్సిపల్ పాలకవర్గం

మేడ్చల్: విహార యాత్రో.. వినోద యాత్రో తెలియదు కానీ గుండ్లపోచంపల్లి మున్సిపల్ చైర్‌పర్సన్, కౌన్సెలర్లు, బీఆర్ఎస్ నాయకులు విదేశీ యాత్రలో బిజీగా ఉన్నారు. మున్సిపల్ చైర్ పర్సన్ మద్దుల లక్ష్మీ శ్రీనివాస్‌రెడ్డి, వైస్ చైర్మన్ ప్రభాకర్, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు తమ కుటుంబాలతో కలిసి సింగపూర్ ప్రయాణం చేశారు. రాజకీయ నేతలు తమ కుటుంబాలతో కలిసి హాయిగా ఎంజాయ్ చేస్తున్నారు. ప్రతిపక్ష పార్టీల వారు మినహా అందరు కౌన్సిలర్లు విదేశాలకు వెళ్లడంతో పోచంపల్లిలో ప్రధాన నాయకుల హడావుడి కనిపించడంలేదు. పాలనను అధికారులకు వదిలేసి అందరూ ఒకేసారి వెళ్లడంతో మున్సిపల్ ఖాళీ అయ్యింది.

తైక్వాండో పోటీల్లో జవహర్‌నగర్ విద్యార్థుల ప్రతిభ



పతకాలు సాధించిన విద్యార్థులతో మాస్టర్ నరేందర్‌యాదవ్

జవహర్‌నగర్: జవహర్‌నగర్ కార్పొరేషన్‌కు చెందిన విద్యార్థులు బెంగళూరులో నిర్వహించిన జాతీయ స్థాయి తైక్వాండో పోటీల్లో ప్రతిభచాటి అవార్డులు సాధించారు. అఖిల్ చక్ర, రేవంత్‌లు ఫైటింగ్‌లో గోల్డ్, కటాస్‌లో సిల్వర్, యోజిత్ ఫైటింగ్‌లో సిల్వర్, కటాస్‌లో సిల్వర్ పతకాలు సాధించారు. ఈ సందర్భంగా మాస్టర్ నరేందర్‌యాదవ్, స్థానికులు విద్యార్థులకు అభినందనలు తెలియజేశారు.

పిల్లి ప్రాణాలు కాపాడిన ట్రాఫిక్ కానిస్టేబుల్



ఉప్పల్: ఉప్పల్ రింగ్ రోడ్డు కేంద్రీయ విద్యాలయం-1 వైపు కొనసాగుతున్న ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణ పనుల్లో భాగంగా నిర్మించిన పిల్లర్‌లో పిల్లి చిక్కుకుంది. మూడు రోజులుగా అరుస్తున్నా ఎవరికీ వినిపించ లేదు. అంత ఎత్తు ఎక్కి తీసేందుకు ఎవరూ సాహసం చేయలేదు. విషయం తెలుసుకున్న ఉప్పల్ ట్రాఫిక్ కానిస్టేబుల్ పాండు పిల్లర్లపైకి ఇనుప చువ్వల ద్వారా ఎక్కి పిల్లిని రక్షించారు. దీంతో స్థానికులు, జంతు ప్రేమికులు అతడి సాహసాన్ని అభినందించారు.

తెలంగాణను మోడల్ రాష్ట్రంగా మారుస్తాం



నాగారం మున్సిపాలిటీ పరిధిలో అభివృద్ధి పనులు శంకుస్థాపనలో మంత్రి మల్లారెడ్డి



కుందన్‌పల్లి పరిధిలో కాల్వను పరిశీలించి, స్థానికులతో మాట్లాడుతున్న మల్లారెడ్డి

మంత్రి చామకూర మల్లారెడ్డి

కీసర: మున్సిపాలిటీల్లో అభివృద్ధి పనులు చేపట్టేందుకు సీఎం కేసీఆర్, కేటీఆర్ పెద్ద ఎత్తున నిధులు కేటాయిస్తున్నట్లు మంత్రి చామకూర మల్లారెడ్డి అన్నారు. మంగళవారం నాగారం మున్సిపాలిటీలోని పలు వార్డుల్లో సుమారు రూ.70 లక్షల మున్సిపల్ సాధారణ నిధులతో చేపట్టనున్న సీసీ రోడ్డు, అంతర్గత మురుగు కాల్వల నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. 5వ వార్డులోని సత్యనారాయణ ఆలయంలో మండపం ప్రారంభోత్సవంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాగారం మున్సిపాలిటీలో రహదారుల విస్తరణకు కోట్లాది రూపాయల నిధులు కేటాయించామన్నారు. పార్కులు, అంగన్‌వాడీ కేంద్రాలు, కమ్యూనిటీ భవనాలు, శ్మశానవాటికల అభివృద్ధి, తాగునీటి సరఫరా నిమిత్తం ట్యాంకుల నిర్మాణాలు తదితర పనులను దాదాపు పూర్తి చేశామన్నారు. అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలులో బీఆర్ఎస్ ప్రభుత్వం ముందంజలో ఉందన్నారు. రానున్న రోజుల్లో తెలంగాణను మోడల్ రాష్ట్రంగా తీర్చిదిద్దుతామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి, వైస్ చైర్మన్ బండారి మల్లేష్‌యాదవ్, కమిషనర్ రాజేంద్రకుమార్, మేనేజర్ చంద్రశేఖర్, డీఈఈ రఘు, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కుందన్‌పల్లిలో పర్యటన

దమ్మాయిగూడ మున్సిపాలిటీ పరిధిలోని కుందన్‌పల్లిలో రాంకీ డంపింగ్ యార్డు నుంచి వ్యర్థాలు వచ్చే నాలాను మంగళవారం కార్మికశాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి సందర్శించారు. సూర్యానారాయణ చెరువు దగ్గర ఉన్న కాలనీవాసులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకొని రాంకీ డంపింగ్ యార్డు నుంచి వ్యర్థాలు చెరువులో కలవకుండా తూము ఏర్పాటు చేయాలని ఇరిగేషన్ డిపార్ట్‌మెంట్ ఏఈ ప్రశాంత్‌కు ఆదేశాలు జారీ చేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ ప్రణీతాగౌడ్, వైస్ చైర్మన్ మాదిరెడ్డి నరేందర్‌రెడ్డి, కౌన్సిలర్లు వెంకటేష్, సుజాత, నానునాయక్, కొత్త సురేఖ, నేతలు శ్రీకాంత్‌గౌడ్, హరిగౌడ్, భాస్కర్‌గౌడ్, తిరుపతిరెడ్డి, ఖాజామియా తదితరులు పాల్గొన్నారు.

డబ్బులు కట్టకపోతే కూల్చుడే..

- జీవో-59 ద్వారా నోటీసులు వచ్చిన వారు వెంటనే డబ్బులు చెల్లించాలి
- గడువులోపు చెల్లించకుంటే కూల్చివేస్తాం
- కాప్రా మండల తహసీల్దార్ మతిన్

జవహర్‌నగర్: జవహర్‌నగర్ కార్పొరేషన్ పరిధిలో జీవో-59 కింద నోటీసులు అందుకున్నవారు డబ్బులు చెల్లించాలని కాప్రా మండల తహసీల్దార్ మతిన్ అన్నారు. జవహర్‌నగర్ పరిధిలో జీవో-59 కింద నోటీసులు అందిన పలువురు ఇళ్లకు మంగళవారం తహసీల్దార్ మతిన్ ఆధ్వర్యంలో వెళ్లి హెచ్చరికలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ భూముల్లో నివసిస్తున్న పేదల ఇళ్ల క్రమబద్ధీకరణ కోసం జీవో-58, 59 ద్వారా వేలాది మంది దరఖాస్తు చేసుకున్నారని, అందులో జీవో-58 ద్వారా చాలామంది పేదలు తమ ఇళ్లను క్రమబద్ధీకరించుకున్నారని అన్నారు. జీవో-59 ద్వారా అర్హులైన వారికి నోటీసులు అందించామని మూడు విడతల్లో డబ్బులు చెల్లించాలని ఆదేశాలు జారీ చేశామన్నారు. గడువులోపు డబ్బులు చెల్లించాలని లేదంటే కూల్చివేస్తామన్నారు. నోటీసులు అందుకున్నవారు డబ్బులు కట్టి ఇళ్లను క్రమబద్ధీకరించుకోవాలని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.



మతిన్, తహసీల్దార్, కాప్రా



జవహర్‌నగర్‌లో నోటీసులు అందిన వారి ఇళ్లకు వెళ్లి హెచ్చరికలు జారీ చేస్తున్న తహసీల్దార్ మతిన్

అర్హులకు బ్యాంకర్లు రుణాలు ఇవ్వాలి



జిల్లా అదనపు కలెక్టర్ అభిషేక్ అగస్త్య

సాక్షి, మేడ్చల్ జిల్లా: అర్హులైన వారికి బ్యాంకర్లు రుణాలు మంజూరు చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ అభిషేక్ అగస్త్య అన్నారు. మంగళవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో బ్యాంకర్లు, సంబంధిత అధికారులతో డీసీసీ, డీఎల్‌ఆర్సీ సమావేశాన్ని ఆయన నిర్వహించారు. లక్ష్య సాధనలో వెనుకబడిన బ్యాంకర్లు తమ పనితీరును మెరుగు పర్చుకోవాలని ఆయన సూచించారు. రైతులకు పంట రుణాలు, టర్మ్ లోన్లు విరివిగా అందించాలన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, పరిశ్రమలు, డీఆర్‌డీఓ శాఖల ద్వారా ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాల మేరకు బ్యాంకులు ఉపాధి యూనిట్ల స్థాపన, చిన్న, మధ్య తరహా, విద్య, గృహ నిర్మాణం, ఇతర ప్రాధాన్యత రంగాలకు అర్హులైన లబ్ధిదారులకు మంజూరు చేయాలని కోరారు. చిరు వ్యాపారులు.. తమ వ్యాపారాలను విస్తరించుకోవడానికి రుణాలు అందించాలని అన్నారు. ప్రభుత్వ శాఖల అధికారులు, బ్యాంకర్లు సమన్వయంతో నిర్దేశించిన లక్ష్యాలను సాధించేందుకు నిర్ణీత గడువులోగా రుణాల మంజూరుకు కృషి చేయాలన్నారు. స్వయం సహాయక సంఘాల రుణాలను సకాలంలో తిరిగి చెల్లించేలా బ్యాంకర్లు సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకోవాలన్నారు. బ్యాంకులు జూన్ త్రైమాసికంలో 67.70 శాతం లక్ష్యాన్ని సాధించినందుకు ఆయన అభినందించారు. వన్ టైం సెటిల్‌మెంట్‌పై ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టాలన్నారు. సమావేశంలో లీడ్ బ్యాంక్ మేనేజర్ శ్రీనివాసులు, ఆర్బీఐ ఎల్‌డీఓ తాన్య, నాబార్డ్ డీడీఎం సురభి, జీఎండీఐసీ రవీందర్, జడ్పీ సీఈవో దేవసహాయం, డీఆర్డీవో పద్మజారాణి, జిల్లా వ్యవసాయాధికారి మేరీరేఖ,వివిధ బ్యాంకుల మేనేజర్లు,ఉద్యాన శాఖ, మెప్మా, ఎస్సీ కార్పొరేషన్, డీఐసీ, కేవీఐసీ, ఆర్బీఐ, నాబార్డు అధికారులు పాల్గొన్నారు.

ఎస్‌కేఎమ్ స్కూల్‌లో రాఖీ వేడుకలు



రాఖీ వేడుకల్లో విద్యార్థులు

మేడ్చల్‌రూరల్: మండలంలోని మునీరాబాద్ గ్రామంలోని ఎస్‌కేఎమ్ పాఠశాలలో బుధవారం రాఖీ వేడుకలను విద్యార్థులు ఘనంగా జరుపుకున్నారు. పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సీనియర్, జూనియర్ విద్యార్థులకు సోదరభావంతో రాఖీ కట్టి మిఠాయి తినిపించారు. అనంతరం విద్యార్థులకు రాఖీ తయారీ పోటీలను నిర్వహించి బహుమతులను అందజేశారు. పండగ విశిష్టతను వివరించారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ లవకుమార్‌గౌడ్, డైరెక్టర్ శృతిగౌడ్, ప్రిన్సిపాల్ సరస్వతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



రాఖీ కడుతున్న విద్యార్థినులు

ఓటమికి భయపడే.. హడావుడిగా రోడ్లు

- నాలుగున్నర ఏళ్లుగా ఒక్క పని చేయని మంత్రి
- ఓట్ల కోసం సొంత డబ్బులు పెట్టి పనులు
- సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డిని కించపర్చడం సరికాదు
- కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గోమారం రమణారెడ్డి

మేడ్చల్: మంత్రి మల్లారెడ్డి మితిమీరిన విశ్వాసంతో తనకు పోటీయే లేదంటూ కాంగ్రెస్ పార్టీని, కాంగ్రెస్ నియోజకవర్గ కో ఆర్డినేటర్ సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డిని కించ పరుస్తూ మాట్లాడటం బాగా లేదని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గోమారం రమణారెడ్డి అన్నారు. మల్లారెడ్డికి ఓటమి అంటే ఏంటో కాంగ్రెస్ పార్టీ చూపిస్తుందని అన్నారు. కేవలం డబ్బులతో రాజకీయం చేస్తూ.. ప్రజలకు సేవలు చేస్తున్న హరివర్ధన్‌రెడ్డి లాంటి సుదీర్ఘ రాజకీయ చరిత్ర ఉన్న నాయకుడిని విమర్శించడం సమంజసం కాదన్నారు. ఎన్నికల్లో ఓటమి తప్పదని, కాంగ్రెస్ పార్టీకి భయపడి హడావుడిగా రోడ్ల నిర్మాణం చేస్తున్నారని అన్నారు. ప్రజలపై ప్రేమ ఉంటే నాలుగున్నర ఏళ్లుగా ఒక్క పని చేయని మంత్రి మల్లారెడ్డి ఎన్నికల సమయం దగ్గరకు రావడంతో ఓట్ల కోసం తన డబ్బులు పెట్టి రోడ్లు ఎందుకు వేస్తున్నారని ప్రశ్నించారు. తాము ఎన్నికలలో గెలిచినా ఓడినా.. ప్రజల మధ్యలో ఉంటూ నిత్యం ప్రజలకు సేవలు చేస్తున్నామని, మంత్రి మల్లారెడ్డి ఓడిపోతే అడ్రస్ సైతం కనిపించదని ఎద్దేవా చేశారు.

ముదిరాజ్‌లకు సీట్లు కేటాయించాలి



ముదిరాజ్‌లకు సీట్లు కేటాయించాలని అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

మేడ్చల్‌రూరల్: జనాభా ప్రాతిపదికన ముదిరాజ్‌లకు అసెంబ్లీ టికెట్లు ఇవ్వాలని మండలంలోని పూడూర్ గ్రామంలో ముదిరాజ్ సంఘ నాయకులు బుధవారం గ్రామంలోని అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. ఇటీవల సీఎం కేసీఆర్ ప్రకటించిన బీఆర్ఎస్ అభ్యర్థుల జాబితాలో ముదిరాజ్‌లకు ఒక్క సీటు కూడా ప్రకటించకపోవడం సరికాదని అన్నారు. కేసీఆర్ పునరాలోచన చేసి ముదిరాజ్‌లకు టికెట్లు కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షుడు పరమేశ్, యూత్ అధ్యక్షుడు నాగరాజు, ఉపాధ్యక్షుడు శ్రీరాములు, వార్డు సభ్యులు హన్మంత్‌రెడ్డి, జనార్దన్‌యాదవ్, బీజేపీ మండల ఉపాధ్యక్షుడు మల్లారెడ్డి, మాజీ ఉపసర్పంచ్ సుదర్శన్, మాజీ వార్డు సభ్యులు తుపాకుల క్రిష్ణ, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

లక్ష్యం కోసం నిరంతరం కృషి చేస్తే విజయం

టెక్ మహీంద్రా గ్రూప్ డెలివరీ హెడ్, ఉపాధ్యక్షుడు మల్లాది నాగార్జున



మాట్లాడుతున్న ముఖ్యఅతిథి మల్లాది నాగార్జున

ఘట్‌కేసర్: మారుతున్న సాంకేతికతకు అనుగుణంగా విద్యార్థులు తమ నైపుణ్యం పెంపొందించుకోవాలని టెక్ మహీంద్రా గ్రూపు డెలివరీ హెడ్, ఉపాధ్యక్షుడు మల్లాది నాగార్జున అన్నారు. మంగళవారం చౌదరిగూడ నల్లా నర్సింహారెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ మొదటి సంవత్సరం విద్యార్థులకు ఓరియంటేషన్ ప్రోగ్రామ్‌కు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు లక్ష్యాలను సాధించే దిశగా నిరంతరం కృషి చేస్తే విజయం వరిస్తుందన్నారు. క్రమశిక్షణతో చదువుకొని కళాశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలని, స్వయం ఉపాధితో పాటు ఇతరులకు ఉపాధి కల్పించాలన్నారు. కార్యక్రమంలో కళాశాల వైస్ చైర్మన్ ప్రశాంత్‌రెడ్డి, డైరెక్టర్ సీవీ కృష్ణారెడ్డి, ఇంజినీరింగ్ డీన్ జానార్దన్‌రాజు, కార్యక్రమం కన్వీనర్ చంద్రశేఖర్, పలు విభాగాల అధిపతులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మహిళ కళ్లలో కారం చల్లి చైన్ స్నాచింగ్

ఘట్‌కేసర్: ఓ దుండగుడు మహిళ కళ్లలో కారం పొడి చల్లి మెడలోని బంగారు చైన్‌ను తెంపి లాక్కెళ్లిన ఘటన ఘట్‌కేసర్‌లో మంగళవారం చోటుచేసుకుంది. సీఐ మహేందర్‌రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. హన్మకొండకు చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయురాలు కల్వకుంట్ల మంజుల(52) కాప్రాలోని సోదరి ఇంటిలో ఫంక్షన్‌కు హాజరయ్యేందుకు కుటుంబ సభ్యులతో కలిసి కారులో బయలుదేరింది. ఘట్‌కేసర్ బైపాస్ రోడ్డు వద్ద ఉదయం 6.30 గంటల సమయంలో ఆమె భర్త ఆమెను దించి శంషాబాద్‌కు ఓఆర్ఆర్‌పై వెళ్లిపోయాడు. ఆమె కారు దిగి యంనంపేట్ చౌరస్తాకు నడుచుకుంటూ వస్తున్న క్రమంలో బస్టాప్‌కు చేరుకోకముందే ఓ దుండగుడు ఆమె కళ్లల్లో కారం పొడి చల్లి చైన్ లాక్కెళ్లాడు. ఆమె కోలుకునేలోపు దుండగుడు సమీపంలోని హెచ్‌ఎండీఏ పెంచిన చెట్లలోకి కనుమరుగయ్యాడు. కాగా చైన్ మూడు తులాలు ఉండగా రెండు తులాలు ఆమె మెడలోనే ఉండిపోయింది. అక్కడున్న ఆటో డ్రైవర్లు దుండగుడి వెంబడి పరుగెత్తినా ఫలితం లేకుండా పోయింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. సీసీ పుటేజీల ఆధారంగా దండగుడి కోసం తీవ్రంగా గాలిస్తున్నారు.

అర్హులైన వారికి దళిత బంధు ఇవ్వాలి

ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి



ఘట్‌కేసర్ దళిత మోర్చా ధర్నాలో మాట్లాడుతున్న ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి

ఘట్‌కేసర్: అర్హులైన ప్రతి దళిత కుటుంబానికి దళిత బంధు, మూడెకరాల భూమి ఇవ్వాలని ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దళితులకు దళితబంధు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ బీజేపీ దళిత మోర్చా జిల్లా అధ్యక్షుడు కరుణాకర్ అధ్యక్షతన స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట మంగళవారం నిర్వహించిన ధర్నాకు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీపీ, స్థానిక ఎమ్మెల్యే కొందరి ఏజెంట్లతో దరఖాస్తులు తీసుకొని దళితబంధు ఇస్తామని మభ్యపెడుతున్నాడన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం బీసీ, ఎస్సీ కార్పొరేషన్ నిధులను కల్యాణలక్ష్మికి మరలించాడని, దళితులను మంత్రి ఓటు బ్యాంకులా వాడుకుంటున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. దళిత మోర్చా జిల్లా అధ్యక్షుడు కరుణాకర్ మాట్లాడుతూ దళితులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని, లేనిపక్షంలో ఉద్యమం తీవ్రం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు, ఎంపీటీసీ శోభారాణి, మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శి ప్రవీణ్‌రావు, రవీందర్‌రెడ్డి, కేంద్ర సెన్సార్ బోర్డు సభ్యుడు మహిపాల్‌రెడ్డి, సర్పంచ్ కావేరి, ఎంపీటీసీ వెంకట్‌రెడ్డి, ఉప సర్పంచ్ నరేశ్, రాష్ట్ర దళిత నాయకుడు నాగరాజు, జిల్లా కార్యదర్శి సైదులు, మండల అధ్యక్షుడు మల్లేశ్, పోచారం మున్సిపల్ ప్రధాన కార్యదర్శి నరేశ్, మశ్చేందర్‌రెడ్డి, రఘు, వీరారెడ్డి, శివకుమార్‌నాయక్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

క్రీడలతో జాతీయ అంతర్జాతీయ గుర్తింపు

నెహ్రూ యువకేంద్ర రాష్ట్ర కో ఆర్డినేటర్ విజయారావు



ఏసీఈ కబడ్డీ విజేతలకు షీల్డ్ అందజేస్తున్న విజయరావు, ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి

ఘట్‌కేసర్: క్రీడలతో జాతీయ, అంతర్జాతీయ గుర్తింపు లభిస్తుందని నెహ్రూ యువకేంద్ర రాష్ట్ర కో ఆర్డినేటర్ విజయరావు అన్నారు. మేజర్ ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకొని మంగళవారం అంకుషాపూర్ ఏసీఈ కళాశాలలో జిల్లా యువజన క్రీడల శాఖ ఆధ్వర్యంలో జాతీయ క్రీడా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గౌరవ అతిథి ఎంపీపీ సుదర్శన్‌రెరెడ్డి మాట్లాడుతూ క్రీడలతో స్నేహసంబంధాలు మెరుగుపడతాయన్నారు. అంతకుముందు ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పూలమాల వేశారు. అనంతరం కబడ్డీ, వాలీబాల్, చెస్, క్రికెట్, క్యారమ్ విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా యువజన క్రీడల అధికారి బలరామారావు, నెహ్రూ యువకేంద్ర అధికారి ఐలయ్య, పీఈటీ మల్లేశ్, ఏసీఈ కళాశాల హెచ్‌ఓడీ బాలశేఖర్, ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ మల్లేశ్, పీడీ రాజశేఖర్, విద్యార్థులు పాల్గొన్నారు.

వైశ్య కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి



తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న ఆర్యవైశ్యులు

మేడ్చల్: ప్రభుత్వం హామీ ఇచ్చిన విధంగా వైశ్యుల కోసం కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని పట్టణ వైశ్యులు డిమాండ్ చేశారు. వైశ్య కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ ఆర్యవైశ్యులు పట్టణంలో ర్యాలీ నిర్వహించి తహసీల్దార్ శైలజకు వినతి పత్రం సమర్పించారు. మహాత్మాగాంధీ విగ్రహం నుంచి ర్యాలీని ప్రారంభించి అంబేడ్కర్ విగ్రహం మీదుగా వివేకానంద విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ శైలజకు వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు రవికుమార్ గుప్తా, కృష్ణమూర్తిగుప్తా, చంద్రశేఖర్‌గుప్తా, రమేష్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

భారతి అల్ట్రాఫాస్ట్ సిమెంట్‌తో నిర్మాణాలు వేగవంతం



మేడిపల్లి: సిమెంట్ వ్యాపారంలో రారాజుగా ఎదుగుతున్న వికాట్ గ్రూప్‌నకు చెందిన భారతి సిమెంట్ ఆల్ట్రాఫాస్ట్ పేరుతో ఫాస్ట్ సెట్టింగ్ సిమెంట్‌ను తెలంగాణ రాష్ట్రంలో విడుదల చేసింది. ఆ సంస్థ టెక్నికల్ ఇంజనీర్ ప్రసాద్ తెలిపారు. పీర్జాదిగూడలోని ఎస్ఆర్ ట్రేడర్స్‌లో తాపీమేస్త్రీల సమావేశాన్ని మంగళవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా టెక్నికల్ ఇంజినీర్ ప్రసాద్ మాట్లాడుతూ.. మార్కెట్‌లో లభించే ఇతర సిమెంట్లతో పోలిస్తే భారతి అల్ట్రాఫాస్ట్‌తో నిర్మాణ ప్రక్రియ చాలా వేగవంతంగా పూర్తి చేయవచ్చని అన్నారు. భారతి అల్ట్రాఫాస్ట్‌తో ముఖ్యంగా స్లాబ్‌లు, పిల్లర్లు, బ్రిడ్జిలు, రహదారులకు సరైన ఎంపిక అని పేర్కొన్నారు. అల్ట్రాఫాస్ట్ వినియోగదారులకు ఉచిత సాంకేతిక సహాయాన్ని అందజేస్తామని, స్లాబ్ కాంక్రీట్ సమయంలో నిపుణులైన భారతి సిమెంట్ ఇంజినీర్లు సైట్ వద్దకే వచ్చి సహాయ పడతారని తెలిపారు. డీలర్ సంపత్‌రెడ్డి, తాపీమేస్త్రీలు పాల్గొన్నారు.

లింగాపూర్‌లో సీసీరోడ్డు పనులు షురూ

మేడ్చల్: మండలంలోని లింగాపూర్ గ్రామంలో మంత్రి మల్లారెడ్డి సొంత నిధులతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులు ప్రారంభమయ్యాయి. గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణ పనులను సర్పంచ్ లక్ష్మీ సంజీవయ్య పూజా కార్యక్రమాలు నిర్వహించి పనులు ప్రారంభించారు. తమ గ్రామంలో మొత్తం సీసీ రోడ్లు వేసేందుకు మంత్రి మల్లారెడ్డి తన సొంత నిధులు మంజూరు చేశారని, ఆయన చొరవతో పూర్తిగా రోడ్లు వేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ సత్తమ్మ, వార్డు సభ్యులు కృష్ణవేణి, భూలక్ష్మి, నవీన్, సత్తయ్య, మహేష్, మల్లేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

అత్వెల్లిలో ..

మేడ్చల్: పట్టణంలోని అత్వెల్లి పరిధిలోని రెండవ వార్డులో సీసీ రోడ్డు నిర్మాణ పనులను మున్సిపల్ చైర్ పర్సన్ దీపికనర్సింహారెడ్డి ప్రారంభించారు. రూ.50 లక్షలతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులకు కౌన్సిలర్ సరిత మల్లేష్‌గౌడ్‌తో కలిసి పూజా కార్యక్రమాలు నిర్వహించి పనులు ప్రారంభించారు. అత్వెల్లి అభివృద్ధికి మున్సిపాలిటీ పెద్దపీట వేస్తుందని ఆమె అన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ యాదగిరి, పట్టణ మాజీ ఉపసర్పంచ్ నర్సింహారెడ్డి, బీఆర్ఎస్ నాయకుడు రవీందర్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు కొండల్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, మాణిక్యరెడ్డి, మోహన్‌రెడ్డి, లక్ష్మయ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మల్లారెడ్డి ట్రస్ట్ ఆధ్వర్యంలో..

ఘట్‌కేసర్: మున్సిపాలిటీలోని తొమ్మిదో వార్డులో మంత్రి మల్లారెడ్డి సొంత డబ్బుతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను మున్సిపల్ వైస్ చైర్మన్ మాధవరెడ్డి, బీఆర్ఎస్ మున్సిపల్ అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్‌తో కలిసి మంగళవారం ప్రారంభించారు. కౌన్సిలర్లు ఆంజనేయులుగౌడ్, నర్సింగ్‌రావు, కోఆప్షన్ సభ్యుడు షౌకత్, సంజీవముదిరాజ్, విష్ణువర్ధన్‌రెడ్డి, కిరణ్, ఖలీల్, అబ్దుల్ అజీజ్, అయూబ్ పాల్గొన్నారు.



రోడ్డు పనులను ప్రారంభిస్తున్న సర్పంచ్ లక్ష్మీ



రోడ్డు పనులను ప్రారంభిస్తున్న చైర్ పర్సన్ దీపికరెడ్డి



ఘట్‌కేసర్‌లో సీసీ పనులు ప్రారంభిస్తున్న వైస్ చైర్మన్ మాధవరెడ్డి, శ్రీనివాస్‌గౌడ్